www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 1 | | సంచిక: 304 | | 28-5-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.5/-

## ప్రైవేటుకు ఫైటర్ జెట్ ఛాన్స్!

- ఏఎంసీఏ అభివృద్ధికి కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం
- టాటా, ఎల్అండ్‌టీ, భారత్ ఫోర్జ్ కన్సార్టియాలకు అవకాశం

4



## అవసరమైతేనే బయటికి రండి



పెరుగుతున్న ఎండలపై ప్రధాని హెచ్చరిక!

డీహైడ్రేషన్ నుంచి జాగ్రత్తగా ఉండాలన్న మోదీ

మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలి

4

## ఎస్ఐఆర్‌కు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్!

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిలిపివేయలేమన్న ధర్మాసనం

4






# అకాల బీభత్సం

- ఉరుములు, ఈదురుగాలులతో తెలంగాణలో భారీ వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వేలాది ధాన్య బస్తాలు
- కల్లాల్లోనే కొట్టుకుపోయిన వడ్లు.. రైతుల ఆవేదన
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నష్టం జరిగిందంటూ మండిపాటు
- గన్నీ సంచులు, లారీల కొరతపై రైతుల తీవ్ర ఆగ్రహం
- పలు జిల్లాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలి అంతరాయం
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- ఆరెంజ్ అలర్ట్ జారీ.. అప్రమత్తంగా ఉండాలన్న వాతావరణ శాఖ



గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు అకాల వర్షాలు ఎండల నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగించినా, అన్నదాతలకు మాత్రం తీరని కన్నీరు మిగిల్చాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ అకాల వర్షాల కారణంగా ఐకేపీ, వివిధ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో, కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. మరికొన్ని చోట్ల వరద ఉధృతికి వడ్ల కుప్పలు కొట్టుకుపోయాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తాము నష్టపోయామని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనకు దిగారు. 2





## మహిళల చేతుల్లో సౌరశక్తి!

ఇది దేశ చరిత్రలే ప్రథమం : డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క

రూ.3 కోట్ల విలువైన సోలార్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రులు

2

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఇందులో భాగంగా సౌర విద్యుత్ ప్రాజెక్టును మహిళా సంఘాలకు అప్పగించడం దేశ చరిత్రలోనే తొలిసారి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను సీతక్కతో కలిసి ఆయన ప్రారంభించారు.

## ముస్లిం సోదరులకు రేవంత్ రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు

- త్యాగానికి, దైవచింతనకు ప్రతీక బక్రీద్ పండుగ: సీఎం రేవంత్ రెడ్డి
- కష్టాలు ఎదురైనా సత్య మార్గంలో నడవాలనే సందేశాన్ని ఇస్తుంది: ముఖ్యమంత్రి
- తమకున్న దానిలో పేదలకు దానం చేయడమే గొప్ప దాతృత్వం అని వెల్లడి

2





## విషాదం

అప్పుల భూతానికి ఒకే కుటుంబంలో నలుగురు బలి

భార్య, పిల్లలను చంపి మామిడి తోట కౌలుదారు ఆత్మహత్య

2

## నీట్ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్

మహారాష్ట్రకు చెందిన డాక్టర్, కోచింగ్ ఫ్యాకల్టీ అదుపులోకి

కేసులో అరెస్టుల సంఖ్య 13కు పెరిగింది



4

## చెరువు శిఖాన్ని ఆక్రమించిన మైహోమ్ సంస్థ?!

- మాదాపూర్ ఐటీ కారిడార్ లో కోట్ల విలువైన స్థలం కబ్జా చేసి కథలు అల్లిన వైనం..?!
- స్వాధీనం చేసుకున్న హైడ్రా..!

2

ఐటీ కారిడార్‌లోని మాధాపూర్‌లో చెరువును మాయం చేసి, కోట్ల విలువైన భూమిని స్వాహా చేయాలనే కబ్జాదారుల కుట్రలను హైడ్రా అడ్డుకుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైహోమ్ చెరువు శిఖాన్ని ఆక్రమించి భవన నిర్మాణాలకు సిద్ధపడిన వైనాన్ని బట్టబయలు చేస్తూ, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ సర్వే నంబరు 7లో ఉన్న 6.05 ఎకరాల ఈదులకుంటను కబ్జాల చెర నుంచి విడిపించింది.





## అక్రమ వలసలపై ఉక్కుపాదం!

2

చొరబాటుదారులతో జాతీయ భద్రతకు పెను సవాల్.

ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక
గురువారం
28 మే 2026

# అకాల వర్షం బీభత్సం



- ఉరుములు, ఈదురుగాలులతో భారీ వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వేలాది ధాన్య బస్తాలు
- కల్లాల్లోనే కొట్టుకుపోయిన వడ్లు.. రైతుల ఆవేదన
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నష్టం జరిగిందంటూ మండిపాటు
- గన్నీ సంచులు, లారీల కొరతపై రైతుల తీవ్ర ఆగ్రహం
- పలు జిల్లాల్లో కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: సీఎం
- ఆరెంజ్ అలర్ట్ జారీ.. అప్రమత్తం: వాతావరణ శాఖ



**హైదరాబాద్, మే 27:** గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు అకాల వర్షాలు ఎండల నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగించినా, అన్నదాతలకు మాత్రం తీరని కన్నీరు మిగిల్చాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ అకాల వర్షాల కారణంగా ఐకేపీ, వివిధ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో, కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. మరికొన్ని చోట్ల వరద ఉధృతికి వడ్ల కుప్పలు కొట్టుకుపోయాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తాము నష్టపోయామని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనకు దిగారు.

### పలు జిల్లాల్లో భారీ వర్షపాతం.. నిలిచిన విద్యుత్ సరఫరా

రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలకు సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది. భారీ ఈదురుగాలుల ధాటికి మెదక్, సిరిసిల్ల, పెద్దపల్లి, సంగారెడ్డి జిల్లాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో రవాణాకు అంతరాయం ఏర్పడటమే కాకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట మండలాల్లో కల్లాలు పూర్తిగా నీట మునిగాయి.

### కళ్లముందే కొట్టుకుపోతున్నా పట్టించుకోరా? అల్లాడుతున్న అన్నదాత

రెక్కలు ముక్కలు చేసుకుని, అప్పులు తెచ్చి ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే నీటిపాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, ప్రారంభించినా అరకొరగా కొనడం, నెలల తరబడి గన్నీ సంచులు అందజేయకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు ఆరోపిస్తున్నారు. తీరా కాంటాలు పూర్తి చేసినా లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడం వల్ల బస్తాల్లో నింపిన ధాన్యం సైతం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మిల్లింగ్ కేంద్రాల వద్ద తరుగు పేరుతో మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ముఖ్యమంత్రి ఆదేశాలు.. యంత్రాంగం అలర్ట్

రాష్ట్రంలో నెలకొన్న అత్యవసర పరిస్థితులు, వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై యంత్రాంగం నిరంతరం అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లను వెంటనే అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను తక్షణమే కొరత ఉన్న ప్రాంతాలకు తరలించాలని, రైతుల ధాన్యపు భద్రతకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

### రానున్న మూడు గంటల్లో వర్షాలు..

తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ రానున్న రోజుల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడే ముప్పు కూడా ఉందని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు జనగామ, మహబూబ్‌నగర్, మేడ్చల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు ప్రత్యేక హెచ్చరికలు జారీ అయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ అధికారులు వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# వనపర్తిలో విషాదం

**అప్పుల భూతానికి ఒకే కుటుంబంలో నలుగురు బలి**

**భార్య, పిల్లలను చంపి మామిడి తోట కౌలుదారు ఆత్మహత్య**

**చనిపోయే ముందు కన్నీరు పెట్టించే సెల్ఫీ, వాయిస్ రికార్డింగ్స్**

**వనపర్తి, మే 27:** అప్పుల భూతం, వడ్డీ వ్యాపారుల వేధింపులు ఒక నిండు కుటుంబాన్ని బలితీసుకున్నాయి. మామిడి తోటలు కౌలుకు తీసుకున్న ఓ రైతు సరైన దిగుబడులు రాక అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చడానికి ప్రైవేటు బ్యాంకులో ఇంటిని తనఖా పెట్టాడు. రెండు నెలలుగా వాయిదాలు చెల్లించకపోవడంతో ప్రైవేటు రుణ సంస్థ నుంచి ఒత్తిడి ఎక్కువైంది. అదేవిధంగా అప్పులు ఇచ్చిన వారి వేధిం పులు పెరిగాయి. వారి వేధింపులు తట్టుకోలేక భార్య, కుమారుడు, కుమార్తెను తాళ్లతో కట్టేసి తోటలో ఉన్న నీటి సంపులో పడేశాడు. అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్యకుపాల్పడ్డాడు. వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండలం సల్కెలాపూర్ గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్కు చెందిన మామిడి తోట గుత్తేదారు గగ్గల్ల నరసింహ (36) వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురంలో మామిడి తోటను నాలుగేళ్లుగా కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటిపై తీసుకున్న రుణం కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి చేసి, మానసికంగా నన్ను ఇబ్బందులకు గురి చేశారు. వేధింపులు తట్టుకోలేక నర్సింహ కుటుంబ సభ్యులను చంపి ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహ భార్య హేమలత (31), కుమారుడు సాయి నిహాల్ (15), సాహితిశ్రీ (13) లను చేతులు కట్టేసి మామిడి తోటలోని సంపులో వేసి ముంచడంతో మృతి చెందారు. నరసింహ ఆత్మహత్య చేసుకునే ముందు అప్పుల బాధతో వేధించిన వారి సమాచారం వివరాలు తెలుపుతూ సెల్ ఫోన్ స్టేటస్ ద్వారా బంధువులకు సమాచారం అందించారు. అతడు ఆత్మహత్య చేసుకునే సమయంలో గద్వాలలోని తన వదిన (భార్య అక్క) అల్లుడు దరిశెల్లికి ఫోన్ చేసి అప్పులు ఇచ్చినవారు వేధింపు లకు గురిచేస్తున్నారని తన కుటుంబ సభ్యులు నీటి సంపులో పడుకున్నారని ఏడుస్తూ తెలిపి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు చెల్లించాలని వేధిస్తున్న వారి వివరాలు సెల్ ఫోన్ లో వాయిస్ రికార్డ్ చేసి స్టేటస్ పెట్టుకున్నాడు. రూ.60 లక్షలు అప్పు ఉంటే రూ. కోటి 20 లక్షలకు పత్రాలు రాయించుకున్నారని ఆరోపించా రు. హోమ్ లోన్ వారు ఇంటి లో ఉన్న ఆభరణాలు, వస్తువులను స్వాధీనం చేసుకొని ఇంటికి నోటీసులు అంటించి ఆవేదనకు గురి చేశారని వాపోయాడు. వడ్డీ వ్యాపారులకు రూ.3 వడ్డీ కడుతూ వచ్చానని అప్పుల భారం మోయలేక, చిత్రహింసలు భరించలేకపోతున్నానని బోరుమన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మృతుడి కూతురు, కుమారుడిని పాఠశాలలో ఎగతాళి చేస్తున్నారని చదువు మాన్పించి తోటలో పనులు చేయించాడని తెలిపారు. మామిడి తోటకు లక్షల అప్పులు చేసి మందులు వేసి నష్టపోయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఈ ఘటనను చూసి కన్నీరు మున్నీర య్యారు. సంఘటన స్థలాన్ని డిఎస్పి గిరిబాబు, సిఐ రాంబాబు, ఎస్సై వెంకటేష్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు అనాలోచిత చర్యల వల్ల జీవితాలు నాశనం చేసుకుంటారని తెలిపారు. నరసింహ మామిడి తోటలను కౌలుకు తీసుకొని అప్పుల వారి ఒత్తిడితో కుటుంబ సభ్యులను నీళ్ల సంపులో ముంచిన అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి వాయిస్ రికార్డులను పరిశీలించి కుటుంబ సభ్యుల మృతికి బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి బక్రీద్ శుభాకాంక్షలు

**త్యాగానికి, దైవచింతనకు ప్రతీక బక్రీద్ పండుగ**

**కష్టాలు ఎదురైనా సత్య మార్గంలో నడవాలనే సందేశాన్ని ఇస్తుంది**

**తమకున్న దానిలో పేదలకు దానం చేయడమే గొప్ప దాతృత్వం**



**హైదరాబాద్, మే 28:** ముస్లిం సోదరుల పవిత్ర పండుగ బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లింలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నిస్వార్థానికి, దైవభక్తికి, సర్వస్వ శరణాగతికి ఈ పండుగ ఒక గొప్ప ప్రతీక అని ఆయన కొనియాడారు. భగవంతుని కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడే మహోన్నత భావనను స్మరిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పండుగ మానవాళికి త్యాగం, దాతృత్వం, విశ్వాసం మరియు మానవతావాదం వంటి గొప్ప విలువలను గుర్తు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు, సవాళ్లు ఎదురైనప్పటికీ, భగవంతునిపై అచంచలమైన నమ్మకంతో సత్య మార్గంలో ముందుకు సాగాలనే అమూల్యమైన సందేశాన్ని బక్రీద్ అందిస్తుందని ఆయన వివరించారు. కష్టకాలంలో తమకు ఉన్న దాంట్లోనే కొంత భాగాన్ని నిరుపేదలకు, అవసరార్థులకు దానం చేయడమే అన్నింటికన్నా మిన్నయైన దాతృత్వమనే స్ఫూర్తిదాయక సిద్ధాంతాన్ని బక్రీద్ ప్రపంచానికి చాటిచెబుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# మహిళల చేతుల్లో సౌరశక్తి!

**ఇది దేశ చరిత్రలే ప్రథమం : డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క**

**రూ.3 కోట్ల విలువైన సోలార్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రులు**



**ఎర్రుపాలెం/మధిర, మే 27:** మహిళల ఆర్థిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రక అడుగు వేసిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని వెంకటాపురం గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.3 కోట్ల విలువైన సోలార్ పవర్ ప్లాంట్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. మహిళా సంఘాల చేతుల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులు పెట్టడం దేశ చరిత్రలోనే తొలిసారి అని అన్నారు. మహిళలకు ఆర్థికంగా బలం చేకూర్చేందుకు ప్రభుత్వం పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు, పసుపు బాయిలర్ ప్లాంట్లు, సోలార్ ప్రాజెక్టుల బాధ్యతలు అప్పగిస్తోందని తెలిపారు. వెంకటాపురం సోలార్ ప్లాంట్ ద్వారా మహిళా సంఘాలకు రోజుకు రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం భూమితో పాటు సబ్సిడీ కూడా అందిస్తోందని, ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కమ్‌లు కొనుగోలు చేసేలా ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. 2030 నాటికి రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి తెలిపారు. ప్రతి జిల్లాలో ఇలాంటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. మహిళల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని మహిళలే కాపాడుకోవాలని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన సూచించారు. అనంతరం ఎర్రుపాలెం మండలంలో రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఇందులో 132/33 కేవీ సబ్‌స్టేషన్, 33/11 కేవీ సబ్‌స్టేషన్, హెచ్‌పీ పెట్రోల్ బంక్, పసుపు బాయిలర్ ప్లాంట్ తదితర ప్రాజెక్టులు ఉన్నాయి.

# చెరువు శిఖాన్ని ఆక్రమించిన మైహోమ్ సంస్థ?!


**మాదాపూర్ ఐటీ కారిడార్‌లో కోట్ల విలువైన స్థలం కబ్జా చేసి కథలు అల్లిన వైనం..?!**



**హైదరాబాద్, మే 27:** ఐటీ కారిడార్‌లోని మాధాపూర్‌లో చెరువును మాయం చేయాలనే కబ్జాదదారుల ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ సర్వే నంబరు 7లో ఉన్న 6.05 ఎకరాల ఈదులకుంటను కబ్జాల చెర నుంచి విడిపించింది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట నిండితే వరద కాలువ ద్వారా ఈదుల కుంటకు నీరు చేరేది. ఆ కాలువను డైవర్ట్ చేయడంతో ఈదుల కుంటకు వరద నీరు చేరకుండా చేశారు. చెరువు రూపురేఖలు మార్చేసి.. హద్దులు చెరిపేసి... ఇక భవన నిర్మాణాలే ఆలస్యం అనుకున్న తరుణంలో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. తమ్మిడికుంట – ఈదులకుంట– సున్నం చెరువులుగా గొలుసుకట్టుగా ఉన్న వాటిలో ఈదుల కుంట మాయమౌతోందని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసు నమోదయ్యింది. స్థానికుల ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రాకు అక్కడ చెరువు ఆనవాళ్లు కనిపించాయి. గ్రామ, రెవెన్యూ రికార్డుల మేరకు 6.05 ఎకరాల చెరువున్నట్టు నిర్ధారించుకుంది. ఇదే విషయాన్ని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాలు కూడా నిర్ధారించాయి. దీంతో మంగళవారం చెరువు హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేసింది. 6.05 ఎకరాల ఈదులకుంటకు తోడు.. ఆ పక్కనే సర్వే నంబరు 11/37లో ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది. మొత్తం 11.21 ఎకరాల భూమిని కాపాడినట్టు అయ్యింది. ఇలా మొత్తం మాధాపూర్‌లోనే దాదాపు రూ. 1800 కోట్ల విలువైన భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. ఈ భూమి చుట్టూ హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేస్తోంది.

# ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్నెట్!

- తెలంగాణలో టీ-ఫైబర్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- అమెండేడ్ భారత్‌నెట్ కింద డిజిటల్ తెలంగాణకు బలమైన పునాది
- సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుతో కేంద్ర మంత్రి సింధియా వీడియో కాన్ఫరెన్స్
- పెండింగ్ నిధుల విడుదల, ఒప్పందాల వేగవంతంపై కీలక చర్చ
- మొదటి దశలో 3,089 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ
- ప్రతి ఇంటికీ నిరంతర హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ లక్ష్యమన్న రాష్ట్ర ప్రభుత్వం
- రింగ్ ఆర్కిటెక్చర్‌తో అంతరాయం లేని ఇంటర్నెట్ సేవలు అందించనున్న టీ-ఫైబర్



**హైదరాబాద్, మే 27:** తెలంగాణలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందించే లక్ష్యంతో టీ–ఫైబర్ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. అమెండేడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద టీ–ఫైబర్ అమలుపై కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అమలుకు సంబంధించిన ఒప్పందాన్ని త్వరితగతిన పూర్తి చేయడం, పెండింగ్ నిధుల విడుదలను వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామపంచాయతీ వరకు రింగ్ నెట్‌వర్క్ ఆస్తుల బదిలీపై స్పష్టమైన విధానం రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై సింధియా సానుకూలంగా స్పందించి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. టీ–ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి గ్రామపంచాయతీని రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా అనుసంధానించనున్నారు. ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గంలో సేవలు కొనసాగేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడనుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరంతర హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో దెబ్బతిన్న నెట్‌వర్క్ ఉన్న 3,089 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ చేపట్టనున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక ఫైబర్ మౌలిక వసతులు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. డిజిటల్ తెలంగాణ నిర్మాణానికి ఇది కీలక మైలురాయిగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది.



# రాష్ట్రంలో నర్సింగ్ విద్య బలోపేతానికి కృషి

**జీఎన్ఎం విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ కాలేజీల్లో కెరీర్ డెవలప్మెంట్ పోస్ట్ బేసిక్ కోర్సు లో అవకాశం**

**నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ పోస్టును క్రియేట్ చేస్తున్నాం**

**మిడ్ వైఫరీ కోర్సులను బలోపేతం**

**మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశం**

**హైదరాబాద్, మే 27 :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో నర్సింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పుల దృష్ట్యా రాష్ట్రంలో నర్సింగ్ విద్య ను బలోపేతం చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంత్రి బుధవారం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నర్సింగ్ కౌన్సిల్ బలోపేతంపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో జీఎన్ఎం విద్యార్థులకు తమ కెరీర్ డెవలప్మెంట్ కోసం పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కాలేజీలలో ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 10 – బీఎస్సీ నర్సింగ్ కాలేజీలను, పీజీ (ఎమ్మెస్సీ) నర్సింగ్ కాలేజ్ ను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కాలేజీలలో మిడ్ వైఫరీ కోర్సులను బలోపేతం చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం లో నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ పోస్టును క్రియేట్ చేయాలని, నర్సింగ్ కౌన్సిల్ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే విద్యార్థులకు, నర్సులకు కార్యాలయ ప్రాంగణంలో కనీస మౌలిక సదు–పాయాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా. అజయ్ కుమార్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా. విద్యుల్లత, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ సీఈ శశిధర్ లు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# డేటా సెంటర్ల హబ్‌గా భారత్

- ఆసియా-పసిఫిక్‌లో రెండో స్థానం.. హైదరాబాద్ అరుదైన ఘనత
- ప్రస్తుతం 1.6 గిగావాట్ల సామర్థ్యం.. నిర్మాణంలో మరో 3.1 గిగావాట్లు
- ముంబైతో పాటు హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ వంటి నగరాలు వృద్ధిలో కీలకం
- ఆసియా-పసిఫిక్‌లో హైదరాబాద్‌ను టాప్ సెకండరీ మార్కెట్‌గా గుర్తించిన నివేదిక



**హైదరాబాద్, మే 27:** భారత డేటా సెంటర్ల మార్కెట్ అత్యంత వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో కీలక స్థానానికి చేరుకుంటోంది. ఆసియా–పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలోనే రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ నిలిచింది. ప్రస్తుతం దేశంలో 1.6 గిగావాట్ల కార్యాచరణ సామర్థ్యం ఉండగా.. మరో 3.1 గిగావాట్ల సామర్థ్యం నిర్మాణం, ప్రణాళిక దశల్లో ఉంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నేడు విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం, హైపర్‌స్కేల్ క్లౌడ్ విస్తరణ, సంస్థల నుంచి డిమాండ్ అధికమవ్వడం వంటి కారణాలతో భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక కేంద్రంగా మారుతోందని నివేదిక పేర్కొంది. ఈ వృద్ధికి ముంబై, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు వంటి నగరాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఈ మార్పుపై కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సరాఫ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ రంగం వృద్ధిలో కొత్త దశకు చేరుకుంది. ఇక్కడ డిమాండ్‌తో పాటు విద్యుత్ లభ్యత, మౌలిక సదుపాయాల సంసిద్ధత, నిర్మాణ సామర్థ్యం అత్యంత కీలకంగా మారాయి" అని వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా భారత్ పటిష్ఠమైన స్థితిలో ఉందని, బలమైన డిమాండ్, విస్తరిస్తున్న డెవలప్‌మెంట్ పైప్‌లైన్, బహుళ నగరాల పర్యావరణ వ్యవస్థ దీనికి దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు.

**గ్లోబల్ డేటా సెంటర్ మార్కెట్‌లో 9వ ర్యాంక్**

భారత డేటా సెంటర్ల మార్కెట్‌కు ముంబై నగరం కేంద్రంగా నిలుస్తోంది. 2026 చివరి నాటికి ఈ నగరం 1 గిగావాట్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధిగమిస్తుందని అంచనా. ఇక హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె వంటి ద్వితీయ శ్రేణి మార్కెట్లు కూడా ఈ వృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోనే టాప్ సెకండరీ మార్కెట్‌గా, ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచిందని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది డేటా సెంటర్ల ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. మరోవైపు బెంగళూరును తృతీయ శ్రేణి మార్కెట్‌గా నివేదిక వర్గీకరించింది. భారతదేశ దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలు కూడా ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆపరేటర్లు పెద్ద ఎత్తున భూములను సేకరిస్తున్నారు. ప్రస్తుతం 10.5 గిగావాట్లకు పైగా సామర్థ్యం ఇంకా భూమి దశలోనే ఉందని, ఇది రాబోయే రోజుల్లో భారీ అభివృద్ధికి సంకేతమని నివేదిక పేర్కొంది.

# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై మహా సీఎంకు రేవంత్ లేఖ



**హైదరాబాద్, మే 27 :** తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత––చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజ్ 152 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్నారు. 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని కూడా మహారాష్ట్ర అప్పట్లో తెలిపింది. ఇటీవల ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని పున: సమీక్షించింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణుల సూచనలతో అంచనాకు వచ్చింది. అందుకే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని సీఎం రేవంత్ రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్ పరిశీలించినా, మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని సీఎం వివరించారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుందని ప్రస్తావించారు.

# భారీగా ఎమ్మార్వోల బదిలీ




**హైదరాబాద్, మే 27:** రాష్ట్రంలో భారీగా తహసీల్దార్లు (ఎమ్మార్వోలు) బదిలీ అయ్యారు. 12 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు జరిగాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆయన స్పష్టం చేశారు. నిర్మల్‌కి చెందిన ఏ. మోతీరాంను మంచిర్యాల డీఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్‌కి చెందిన బి. రాజేశ్వరికి పెద్దపల్లి డీఆర్వో బాధ్యతలు అప్పగించారు. పెద్దపల్లికి చెందిన కె.వై.ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్వోగా నియమించారు. వనపర్తికి చెందిన ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్వోగా బదిలీ చేశారు. ఖమ్మంకి చెందిన వి. రవి కుమార్‌ను ములుగు డీఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. మేడ్చల్–మల్కాజిగిరి జె.స్వామికి కరీంనగర్ డీఆర్వోగా బాధ్యతలు అప్పగించారు. నాగర్‌కర్నూల్‌కి చెందిన ఎ. పాండుకు కామారెడ్డి డీఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. జనగాంకి చెందిన సీహెచ్ శ్రీకాంత్‌కు మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియామించారు. సూర్యాపేటకి చెందిన ఎం. సుదర్శన్ రెడ్డికి సిద్ధిపేట ఎస్‌డీసీ(ఎల్‌ఏ)గా బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం ఎం. రామదేవికి నల్గొండ ఎస్‌డీసీ(ఎల్‌ఏ) పోస్టింగ్, పెద్దపల్లి జి. కుమారస్వామికి సిరిసిల్ల ఎస్‌డీసీ(ఎల్‌ఏ) బాధ్యతలు, కరీంనగర్ ఎన్. వెంకట్ రెడ్డికి కరీంనగర్ ఎస్‌డీసీ(ఎల్‌ఏ)గా నియామకం.

# రూ.1.22 కోట్ల హవాలా డబ్బు పట్టివేత

**హైదరాబాద్, మే 27 :** ముంబై నుండి సికింద్రాబాద్‌కు హవాలా సొమ్ము తరలిస్తున్న ఒక వ్యక్తిని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు బుధవారం నాడు అదుపులోకి తీసుకుని, నిందితుడి నుంచి రూ. 1.22 కోట్ల డబ్బును స్వాధీనం చేసుకున్నారు. రైలు ప్రయాణంలో పట్టుబడిన హవాలా డబ్బు వివరాలను జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్ఎన్ జావెద్ వెల్లడించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు నరసింహారావు, సంజీవరావుల నేతృత్వంలో బొల్లారం––మల్కాజిగిరి స్టేషన్ల మధ్య తనిఖీలు నిర్వహిస్తుండగా దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా లగేజ్ బ్యాగ్‌తో ఉన్న వ్యక్తి పట్టుబడ్డాడు. మహారాష్ట్ర అమరావతి జిల్లాకు చెందిన విజయ్ అంబదాస్ గుప్తా (40) గా గుర్తించిన సదరు వ్యక్తి నుంచి పెద్దమొత్తంలో నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముంబైలోని కాంతా జ్యువెలరీ యజమాని సంతోష్ సేథ్ నుంచి రూ. 1.22 కోట్ల 70 లక్షల డబ్బు తీసుకొని సికింద్రాబాద్‌కు వస్తున్నట్టు అంబదాస్ పోలీసుల విచారణలో వెల్లడించాడు. మోండా మార్కెట్‌లోని బంటీ అనే వ్యాపారికి ఈ డబ్బు బ్యాగును అప్పగించేందుకు వస్తున్నట్టు పేర్కొన్నాడు. ఇందుకు ప్రతిఫలంగా తనకు రూ. 5,000 కమీషన్ ఇచ్చినట్టు చెప్పాడు. పట్టుబడిన డబ్బు హవాలాకు చెందినదిగా గుర్తించిన రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపు పన్నుశాఖ అధికారులకు బదిలీ చేశారు.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

గురువారం
28 మే 2026



# అక్రమ వలసలపై ఉక్కుపాదం!

## చొరబాటుదారులతో జాతీయ భద్రతకు పెను సవాల్..

**జనాభా మార్పులపై అధ్యయనానికి అమిత్ షా ఉన్నత స్థాయి కమిటీ**

## సరిహద్దుల్లో వలసదారుల క్యూ..

**డిటెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు హోం శాఖ ఆదేశాలు**

దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలు, సరిహద్దుల గుండా జరుగుతున్న చొరబాట్లు జాతీయ భద్రతకు, ఆర్థిక వ్యవస్థకు మరియు సామాజిక సమతుల్యతకు పెను సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో అసాధారణ జనాభా మార్పులపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయగా, ఇటు పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపడం ప్రారంభించింది. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులను ఏ విధంగానైతే నిర్దాక్షిణ్యంగా తరిమేసిందో.. ఇప్పుడు భారతదేశం కూడా అదే తరహా కఠినమైన చర్యలకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా అక్రమ వలసలు, ఇతర అసాధారణ కారణాల వల్ల జరుగుతున్న అసహజ జనాభా మార్పుల సరళిని అధ్యయనం చేసేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన వాగ్దానానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు ఈ సమస్య ముప్పుగా మారడంతో కేంద్రం ఈ ముందడుగు వేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, మరియు జనగణన కమిషనర్ ఉంటారు. హోంశాఖ సంయుక్త కార్యదర్శి ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా మత, సామాజికవర్గాల వారీగా చోటుచేసుకుంటున్న మార్పుల సరళిని సమగ్రంగా విశ్లేషించి, ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో లక్షలాది మంది విదేశీయుల ఓట్లను తొలగించిన నేపథ్యంలో ఈ కమిటీ నివేదిక అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

### బెంగాల్‌లో సువేందు అధికారి సర్కార్ కొరడా!


పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం అక్రమ వలసదారులను ఏరివేసే ప్రక్రియను ముమ్మరం చేసింది. గత మమతా బెనర్జీ హయాంలో బంగ్లాదేశ్ నుండి అక్రమంగా చొరబడిన వారు స్థానిక గుర్తింపు పత్రాలు పొంది ఇక్కడి వనరులను వాడుకుంటూ స్థానికులకే సవాల్ విసిరే స్థాయికి చేరారని, వారిపై విదేశీయుల చట్టం కిందే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. "గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి" అనే నినాదంతో బెంగాల్ సర్కార్ వేగంగా ముందుకు వెళ్తోంది. తమ ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకునేలోపే అక్రమ చొరబాటుదారులు రాష్ట్రం విడిచి పారిపోవాలని సీఎం సువేందు అధికారి తీవ్రంగా హెచ్చరించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలని, వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా అంటూ తీవ్ర స్వరంతో నిలదీశారు. భారత్ నుండి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అలాగే చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసులను ఆదేశించారు.

### డిటెన్షన్ సెంటర్లకు తరలింపు.. సరిహద్దుల్లో ఉత్కంఠ

రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి నివసిస్తున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని పశ్చిమ బెంగాల్ హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు శిక్ష ముగిసి స్వదేశానికి వెళ్లేందుకు ఎదురుచూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే ఈ కేంద్రాలకు తరలించేందుకు ఆయా జిల్లాల్లో డిటెన్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించింది. బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున బంగ్లాదేశీయులు గుమిగూడిన దృశ్యాలు కనిపించాయి. కాగా, బెంగాల్ నుంచి పారిపోతున్న అక్రమ వలసదారులు బీహార్, అస్సాం వంటి పొరుగు రాష్ట్రాలలో లేదా హైదరాబాద్ వంటి నగరాలలో తలదాచుకోకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అలర్ట్ కావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కూడా స్థానికంగా తిష్టవేసిన రోహింగ్యాలను గుర్తించి పంపించివేయాలని భద్రతా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రైవేటు రంగానికి ఫైటర్ జెట్ ఛాన్స్!

- ఏఎమ్‌సీఏ అభివృద్ధికి కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం
- టాటా, ఎల్‌అండ్‌టీ, భారత్ ఫోర్జ్ కన్సార్టియాలకు అవకాశం




**న్యూఢిల్లీ:** అత్యాధునిక యుద్ధ విమానాల తయారీలో స్వావలంబన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దేశీయంగా 5వ తరం అత్యాధునిక మధ్యశ్రేణి కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎమ్‌సీఏ) అభివృద్ధి కోసం తొలిసారిగా ప్రైవేటు రంగ సంస్థలకు అవకాశం కల్పిస్తూ కేంద్రం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) విడుదల చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్‌అండ్‌టీ–బీఈఎల్–డైనమాటిక్ కన్సార్టియం, భారత్ ఫోర్జ్–బీఈఎమ్ఎల్–డాటా పాటర్న్స్ కన్సార్టియంలను మలిదశకు ఎంపిక చేసినట్లు సమాచారం. రూ.15 వేల కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టు దక్కించుకునే సంస్థలు ఐదు ప్రొటోటైప్ నమూనాలు, ఒక ప్రయోగాత్మక ఫైటర్ జెట్‌ను తయారు చేసే బాధ్యత చేపట్టనున్నాయి. ఫైటర్ జెట్ అభివృద్ధిని వేగవంతం చేయడం, రక్షణ రంగంలో విదేశీ ఆధారాన్ని తగ్గించడం లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది. అయితే ఎంపికైన సంస్థలు ఎయిరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓలతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో 650 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ కాంప్లెక్స్‌లో ఏఎమ్‌సీఏ అభివృద్ధి చేపట్టనున్నారు. ఇప్పటికే 2025లో ఏడీఏ, డీఆర్‌డీఓ సంయుక్తంగా ఆసక్తిగల సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం ఏడు సంస్థలు స్పందించాయి. వాటిలో మూడు సంస్థలను మలిదశకు ఎంపిక చేశారు. ఎంపికైన సంస్థలు తమ బిడ్స్ సమర్పించేందుకు కేంద్రం మూడు నెలల గడువు ఇచ్చింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టు కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని రక్షణ వర్గాలు వెల్లడించాయి.



# నీట్ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్!

**మహారాష్ట్రకు చెందిన డాక్టర్, కోచింగ్ ఫ్యాకల్టీ అదుపులోకి**

**కేసులో అరెస్టుల సంఖ్య 13కు పెరిగింది**


**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ యూజీ–2026 ప్రశ్నపత్రాల లీక్ కేసులో సీబీఐ మరో ఇద్దరిని అరెస్టు చేసింది. మహారాష్ట్రకు చెందిన డాక్టర్ మనోజ్ శిరూరే, ప్రముఖ కోచింగ్ సెంటర్ ఫ్యాకల్టీ తేజస్ హర్షద్ కుమార్ షాలను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 13కు చేరింది. సీబీఐ వివరాల ప్రకారం.. మనోజ్ శిరూరే లాతూర్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఓ కోచింగ్ సెంటర్ యజమాని కుమారుడితో పాటు ముగ్గురు విద్యార్థులకు కెమిస్ట్రీ ప్రశ్నపత్రాలు లీక్ చేయడంలో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నపత్రాలను మరో నిందితుడు పి.వి. కులకర్ణి నుంచి అతడు పొందినట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. మరో నిందితుడు తేజస్ హర్షద్ కుమార్ షా పూణేలోని ప్రముఖ కోచింగ్ సంస్థ 'డాక్టర్ అభంగ్ ప్రభు మెడికల్ అకాడమీ' (ఏపీఎంఏ)లో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాడు. ఇప్పటికే కస్టడీలో ఉన్న మనీషా హవల్దార్ నుంచి ఫిజిక్స్ ప్రశ్నపత్రాలను పొందినట్లు సీబీఐ ఆరోపించింది. వీరిద్దరి పాత్రపై మరింత లోతుగా విచారణ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. కాగా, నీట్ పేపర్ లీక్ ఘటనపై సీబీఐ ఈ ఏడాది మే 12న కేసు నమోదు చేసింది. అనంతరం దేశవ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పూణే, లాతూర్, అహల్యానగర్ తదితర ప్రాంతాల్లో మొత్తం 49 చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ కేసుకు సంబంధించి ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వెల్లడించింది.

# ఎస్ఐఆర్‌కు సుప్రీం గ్రీన్ సిగ్నల్!

**ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిలిపివేయలేమన్న ధర్మాసనం**

**ఎన్నికల కమిషన్ అధికారాలకు అత్యున్నత న్యాయస్థానం మద్దతు**

**న్యూఢిల్లీ:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణ ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందనే కారణంతో ఎస్ఐఆర్‌ను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థిస్తూ కీలక తీర్పు వెలువరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950 ప్రకారం ఎస్ఐఆర్ నిర్వహించే పూర్తి అధికారాలు ఎన్నికల కమిషన్‌కు ఉన్నాయని స్పష్టం చేసింది. 'ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుతం మరియు నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ అనే రాజ్యాంగబద్ధ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. ఈ ప్రక్రియ ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. పైగా ఆర్టికల్ 324 కింద ఎన్నికల కమిషన్‌కు రాజ్యాంగం కల్పించిన బాధ్యతలకు జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన అధికారాలను అతిక్రమించిందని చెప్పలేం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, మే 30 నుంచి దేశంలోని 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత, తుది దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పార్టీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




# అవసరమైతేనే బయటికి రండి


**పెరుగుతున్న ఎండలపై ప్రధాని హెచ్చరిక!**

**డీహైడ్రేషన్ నుంచి జాగ్రత్తగా ఉండాలన్న మోదీ**

**ఇళ్ల ముందు మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలి**




**న్యూఢిల్లీ, మే 27:** దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. అనేక రాష్ట్రాల్లో ఎండ తీవ్రత అధికంగా నమోదవుతోందని, దీని ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ప్రధాని మోదీ చేసిన పోస్టులో ప్రజలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండే మధ్యాహ్న సమయాల్లో అత్యవసరం లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలని కోరారు. దాహంతో ఉన్న వారికి ఒక గ్లాస్ నీరు అందించడం గొప్ప సేవ అని పేర్కొన్న ప్రధాని.. ఇళ్ల ముందు, దుకాణాల బయట మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు. ఇతరులకు నీరు అందిస్తూ సేవ చేస్తున్న వారిని అభినందిస్తున్నానని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రధాని సూచించారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే వడదెబ్బ వంటి ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని మోదీ పేర్కొన్నారు.



# అనంతుని ఆభరణాలు మాయం!

**పద్మనాభస్వామి ఆలయంలో కలకలం**

**తిరువనంతపురం, మే 27:** శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యమైన ఘటన సంచలనంగా మారింది. ఈ విషయాన్ని కేరళ డీజీపీ హోంశాఖకు సమర్పించిన నివేదికలో వెల్లడించారు. నివేదిక ప్రకారం సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు కనిపించకుండా పోయాయి. వాటిలో 'వైరమ్ నామం' అనే వజ్రాభరణం కూడా ఉంది. మరమ్మతుల కోసం బయటకు తీసుకెళ్లిన ఈ ఆభరణాన్ని తిరిగి ఆలయానికి తీసుకురాలేదని పేర్కొన్నారు. అలాగే బంగారు దీపం కూడా అదృశ్యమైనట్లు సమాచారం. ఆలయ భద్రతలో లోపాలపై డీజీపీ ఆందోళన వ్యక్తం చేస్తూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విలువైన ఆభరణాలను సురక్షిత ఖజానాల్లో భద్రపరచాలని, కఠిన తనిఖీలు చేపట్టాలని నివేదికలో పేర్కొన్నారు. ఇదిలావుంటే స్వామివారి ఆభరణాలు మాయం కావడంపై భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# ఘనంగా జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, ములుగు:** రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో నెహ్రూ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్ల పల్లిరాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూకు ఘన నివాళులు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ గారి 62వ వర్ధంతి వేడుకలను ఖమ్మం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని నెహ్రూ సేవలను కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో జవహర్లాల్ నెహ్రూ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూమికి బలం పచ్చిరొట్ట పంటలు

## కల్లూరు సొసైటీలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** భూమి సారవంతత పెంపొందించడంలో పచ్చిరొట్ట పంటలు కీలక పాత్ర పోషిస్తాయని కల్లూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ భాగం నీరజ దేవి అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలంలోని కల్లూరు సొసైటీలో పీఏసీఎస్ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు ఆధ్వర్యంలో రైతులకు బుధవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ, సహజ సిద్ధంగా నేలలో పోషకాలను పెంచేందుకు రైతులు పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

- భక్తి పారవశ్యంలో ఈద్గా మైదానాలు
- నేడే అట్టహాసంగా బక్రీద్ వేడుకలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** త్యాగాలకు, భక్తికి నిలువుటద్దంగా నిలిచే బక్రీద్ (ఈద్–ఉల్–అదా) పండుగను జరుపుకోవడానికి ముస్లిం సోదరులు సిద్ధమవుతున్నారు. ఈనెల 28న నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం నగరంలోని ఈద్గా మైదానాలు, మసీదులు ముస్తాబ య్యాయి. పవిత్ర ఖురాన్ సందేశాన్ని పాటిస్తూ, పేదలకు దానధర్మాలు చేస్తూ ముస్లింలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

### ముమ్మరంగా ఈద్గా ఏర్పాట్లు ..

వేలాది మంది భక్తులు ఒకే చోట చేరి నమాజ్ చేసేందుకు వీలుగా ఈద్గా మైదానాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మైదానాలను శుభ్రపర్చడం, ఎండ వేడిమి నుంచి రక్షణ కోసం భారీ టెంట్లు, చాపలు ఏర్పాటు చేశారు. తాగునీరు, శానిటేషన్ వంటి మౌలిక వసతులు కల్పించారు. శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టా రు.

### హజ్ యాత్ర - ఈద్-ఉల్-అదా అనుబంధం..

బక్రీద్ పండుగకు 'హజ్' యాత్రతో విడదీయలేని సంబంధం ఉంది. ఇస్లాంమతంలోని ఐదు ముఖ్య స్తంభాలలో 'హజ్' ఒకటి. ప్రతి సంవత్సరం ఈ పవిత్ర దినాల సమయంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ముస్లింలు సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి చేరుకుంటారు.

**ప్రాముఖ్యత:** హజ్ యాత్ర చేయడం అంటే మనిషి తన పాపాలను ప్రక్షాళన చేసుకుని, కొత్త జీవితాన్ని ప్రారంభించే ఒక ఆధ్యాత్మిక ప్రక్రియ. హజ్ యాత్రలో భాగంగా భక్తులు ప్రవక్త ఇబ్రహీం, ఆయన భార్య హాజరా (అలైహిస్సలాం) చూపిన అచంచలమైన విశ్వాసాన్ని స్మరించుకుంటారు. ప్రపంచంలోని భిన్న సంస్కృతుల వారు ఒకే రంగు దుస్తులు (ఇహ్రామ్) ధరించి, 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్' అని దైవాన్ని ప్రార్థించడం మానవ సమానత్వానికి ప్రతీక.

### త్యాగం, సేవా భావం..

బక్రీద్ రోజున నిర్వహించే 'ఖుర్బానీ' వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం దైవభక్తితో పాటు పేదరిక నిర్మూలన. ఖుర్బానీ ద్వారా వచ్చిన మాంసాన్ని పేదలకు, బంధుమిత్రులకు పంచిపెట్టడం ద్వారా సమాజంలో ఆకలి లేని స్థితిని నెలకొల్పాలని ఇస్లాం బోధిస్తుంది. మనిషి తనలోని స్వార్థాన్ని త్యాగం చేసి, తోటివారికి సాయం చేయడమే ఈ పండుగ ఇచ్చే అసలైన సందేశం.

### ఐకమత్యమే నిదర్శనం..

ఈ పండుగ రోజున సామూహిక ప్రార్థనలు, ఆ తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకోవడం ద్వారా సోదరభావం బలపడుతుంది. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి పండుగను ఆనందంగా జరుపుకోవడం మన దేశ లౌకికత్వానికి నిదర్శనం. ఈ బక్రీద్ మనందరి జీవితాల్లో సుఖశాంతులను, ఐకమత్యాన్ని నింపాలని కోరుకుందాం.– షేక్. ఫసియుద్దీన్, సీనియర్ జర్నలిస్ట్ , నేరడిగొండ.

# పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

- సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న లయన్స్ క్లబ్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లిలో సేవా కార్యక్రమాలకు చిరునామాగా నిలుస్తున్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద, నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. క్లబ్ తరఫున నిత్యం నిర్వహిస్తున్న అల్పాహార పంపిణీ కార్యక్రమంతో పాటు విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పాటుగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఆర్థిక సమస్యల మధ్య చదువును కొనసాగిస్తున్న విద్యార్థులకు ఇది గొప్ప సహాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి కాంగ్రెస్ నాయకుడు ఎండీ కమల్ పాషా విద్యార్థులకు స్వయంగా సైకిళ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని, పేద విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. అల్పాహార పంపిణీతో పేదలకు అండగా నిలుస్తూనే, విద్యార్థుల భవిష్యత్తు కోసం సైకిళ్ల పంపిణీ చేయడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. సేవా దృక్పథంతో ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థలు మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, వలి, రహమత్ పాషా పాల్గొని విద్యార్థులను అభినందించారు. లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ సభ్యులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. పేదల సంక్షేమం, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని కోరారు.

# వీఓఏల ధర్నాకు మాజీ ఎమ్మెల్యే సండ్ర మద్దతు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఐకేపీ, వీఓఏ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పెనుబల్లి మండల కేంద్రంలో ఐకేపీ, వీఓఏ సిబ్బంది చేపట్టిన ధర్నా కార్యక్రమానికి బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు ప్రశాంతంగా లేరని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వీఓఏ సిబ్బందికి కనీస వేతనంగా రూ.20వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, 58 జీఓను సవరించాలని కోరారు. అర్హులైన వీఓఏలను సీసీలుగా పదోన్నతి కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరికి ట్యాబ్ సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చెక్కిలాల మోహన్రావు, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మందాడపు అశోక్ కుమార్, కోట ప్రభాకర్, టీవీ రామారావు, ఎస్కే గౌస్, పసుమర్తి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ చలపతిరావు, చక్కిలాల లక్ష్మణరావు, కోమటి ప్రసాద్, తవునాయక్, కొప్పుల గోవిందరావు, ఎటుకూరి సత్యంబాబు, వంగ చిన్నపండు, వేముల బాబురావు, వేముల సురేష్, వంకొడత్ మురళి, రాజబాబు, మరకాల చంటి, మరకాల వెంకీ, వర్దబోయిన నాగేశ్వరరావు, మల్లాది రవి, గుణగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలని తాండూర్ మండల వ్యవసాయాధికారి కె.సుష్మ పిలుపునిచ్చారు. బుధవారం తాండూర్ మండలంలోని అచ్చలాపూర్, తాండూర్ గ్రామాల్లో నిర్వహించిన వరి పంట క్షేత్ర ప్రదర్శనలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, పత్తి పంటల కోత అనంతరం మిగిలే పంట అవశేషాలను బహిరంగంగా కాల్చడంతో గాలి కాలుష్యం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం ద్వారా నేలలోని సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు నశించి, సేంద్రియ కార్బన్ దెబ్బతింటుందని వివరించారు. అదేవిధంగా నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మపోషకాలు కూడా నశిస్తాయని పేర్కొన్నారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నడంతో అవి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడతాయని రైతులకు సూచించారు.జీఓ నం.27 ప్రకారం వరి పంట అవశేషాలను బహిరంగంగా కాల్చడం పూర్తిగా నిషేధించబడిందని, నిబంధనలు ఉల్లఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సుస్థిర వ్యవసాయం కోసం ప్రతి రైతు పంట అవశేషాలను భూమిలో కలిపి భూసారం పెంచే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వివి. ధనలక్షి , ఎం.వెంకటేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యాలయంలోనూ మహిళలకు రక్షణ కల్పించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళా ఉద్యోగులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల్లో భాగంగా బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో మహిళా సంక్షేమ శాఖ, ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "పోష్ యాక్ట్" ప్రత్యేక అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని స్పష్టం చేశారు. 10 మంది, అంతకంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేసే ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో తప్పనిసరిగా "అంతర్గత ఫిర్యాదుల కమిటీ" ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చిన్న కార్యాలయాల్లో కమిటీలు లేకపోతే జిల్లా స్థాయిలోని లోకల్ కంప్లైంట్ కమిటీ ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే మెజారిటీ ప్రభుత్వ శాఖలు కేంద్ర ప్రభుత్వ "షీ–బాక్స్" పోర్టల్లో తమ వివరాలను నమోదు చేసుకున్నాయని, ఇంకా నమోదు చేయని శాఖలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మహిళా ఉద్యోగులకు హక్కులు, రక్షణ చర్యలపై స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాలు, ఎంపీడీఓ, ఎంఆర్వో కార్యాలయాలు, జిల్లా స్థాయి విభాగాల్లో స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, కలర్ పోస్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ చర్యలపై నివేదికను త్వరలో జిల్లా సంక్షేమ అధికారికి సమర్పించాలని తెలిపారు. వేధింపులకు గురైన మహిళలు అధైర్యపడకుండా టోల్ ఫ్రీ నెంబర్ 181, షీ–బాక్స్ పోర్టల్, రాతపూర్వక ఫిర్యాదుల ద్వారా తమ సమస్యలను కమిటీల దృష్టికి తీసుకురావచ్చని వివరించారు. అనంతరం మహిళా ఉద్యోగుల హక్కులు, రక్షణ మార్గదర్శకాలతో రూపొందించిన పోష్ యాక్ట్ ప్రత్యేక అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, డిహెచ్ఎంహెచ్ఓ నరేందర్, డివైఎస్ఓ శ్రీనివాస్, డీఎస్సీడీవో సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఎల్సీ కమిటీ చైర్పర్సన్ భవన సింగ్, జెడ్పీ సీఈఓ రవి, కోఆర్డినేటర్ యశోద, వివిధ శాఖల అధికారులు, ఇంటర్నల్ కమిటీ సభ్యులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# దేశాభివృద్ధి కి నెహ్రూ సేవలు చిరస్మరణీయం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** దేశాభివృద్ధికి నెహ్రూ సేవలు చిరస్మరణీయమని మార్కెట్ కమిటీ చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. భారత తొలి ప్రధాన మంత్రి, ఆధునిక భారత నిర్మాత పండిట్ జవహర్లాల్ నెహ్రూ వర్ధంతిని ఆదిలాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ చౌక్లోని నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించారు. ఏఎంసీ సభ్యులతో కలిసి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, స్వతంత్ర భారతదేశ నిర్మాణంలోనూ జవహర్లాల్ నెహ్రూ చేసిన కృషి, త్యాగాలను కొనియాడారు. పంచవర్ష ప్రణాళికలు, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా దేశ వ్యవసాయ రంగానికి నెహ్రూ బలమైన పునాదులు వేశారని తెలిపారు. ఆయన వేసిన పునాదులే నేటి దేశ ప్రగతికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సభ్యులు అల్లూరి చంద్రశేఖర్ రెడ్డి, ఇందూరి దివాకర్, మద్దెల పోశెట్టి, కొరటి ప్రభాకర్, రైతు నాయకులు నల్లా గణపతి రెడ్డి, అలీమ్ ఖాన్, ఫహీమ్, స్థానిక రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎజెండా అందలేదని ఎమ్మెల్సీ ఫిర్యాదు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపాలిటీలో బుధవారం జరగాల్సిన కోఆప్షన్ సభ్యుల ఎన్నికల సమావేశం ఉద్రిక్త పరిస్థితుల నడుమ వాయిదా పడింది. సమావేశ ఎజెండా నోటీసులు ముందస్తుగా అందలేదని ఎమ్మెల్సీ దండే విఠల్ జిల్లా కలెక్టర్కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చట్టం ప్రకారం తనతో పాటు మరో ఐదుగురు కౌన్సిలర్లకు సమావేశ ఎజెండా కాపీలు అందలేదని ఆయన పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎజెండా ఇవ్వకుండా సమావేశం నిర్వహించడం చట్టవిరుద్ధమని, దీంతో ఎన్నికను వాయిదా వేయాలని కోరారు. ఇక మున్సిపల్ కార్యాలయంలో సభ్యులకు సరైన సమాచారం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలో ప్రశాంత వాతావరణం లేకపోవడంతో ప్రస్తుతానికి కోఆప్షన్ ఎన్నికల సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ ప్రకటించారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బోయపల్లి బోర్డ్ సమీపంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు బుధవారం సందర్శించారు. కేంద్రంలో నిల్వ ఉన్న వరి ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల్లో 15 నుంచి 20 రోజులుగా ధాన్యం నిల్వ ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి రైతులు భారీ నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మండలంలోని వరి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని సకాలంలో తూకం వేయించి గోదాములు, రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. రైతుల శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తాండూర్ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఎఫ్సీఐ బోర్డు సభ్యుడు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవ రాయలు, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు చిలువేరి శేషగిరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్ధం మల్లేష్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి పాగిడి చిరంజీవి, 120వ బూత్ అధ్యక్షుడు ధర్మరాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలి




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థులు సంబంధిత విద్యుత్ శాఖ ఏఈని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని కేబుల్ సమస్యలతో పాటు పలు వార్డుల్లో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ కండక్టర్లు లేకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ పోల్స్ లేకపోవడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా విద్యుత్ శాఖలో అసిస్టెంట్ హెల్పర్ లేకపోవడంతో గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామంలో ఉన్న లూజ్ పోల్స్ సమస్యలపై కూడా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఈ సానుకూలంగా స్పందిస్తూ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బీనమైన శ్రావణ్, గుర్రం రాజు, మెడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించాలి

- కొనసాగుతున్న ఎస్పీఎం కార్మిక సంఘాల జేఏసీ రిలే నిరాహార దీక్షలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్పీఎం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఎస్పీఎం గేటు ముందు కొనసాగుతున్న ఈ దీక్షలకు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బీఎస్పీ సీనియర్ నాయకురాలు, అడ్వకేట్ రజియా హైదర్ మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. స్థానిక కార్మికులకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. ఈనెల 20 నుంచి యాజమాన్యం మొండివైఖరికి నిరసనగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి, ప్రభుత్వం జోక్యం చేసుకుని యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. జేకే యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కిషోర్, గోలెం వెంకటేశం, గోగర్ల రాములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థం ఎక్స్రే మిషన్ ప్రారంభం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లా ప్రజల సౌకర్యార్థం రెండో డిజిటల్ ఎక్స్రే మిషన్ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనితతో కలిసి ఎక్స్రే మిషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రూ.23 లక్షల విలువైన రెండో డిజిటల్ ఎక్స్రే మిషన్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మిషన్ ద్వారా క్షయవ్యాధి నిర్ధారణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని మారుమూల ప్రాంతాల్లో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించడంలో ఈ మిషన్ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, టిబి సమన్వయకర్త సురేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల కల సాకారం

- జిల్లాలో ఒకేరోజు 2700 ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు ఏర్పాట్లు
- గంభీరావుపేటలో నమూనా గృహాన్ని ప్రారంభించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంతో ఇండ్లు లేని నిరుపేదల కల సాకారమవుతోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటివరకు నిర్మాణం పూర్తయిన 2700 ఇందిరమ్మ ఇండ్లకు వచ్చే నెల 1వ తేదీన ఒకేసారి గృహప్రవేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ కొమిరిశెట్టి విజయ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఈ సాజిద్, తహశీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ పద్మ తదితరులు పాల్గొన్నారు.





# తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు మనోధైర్యం కల్పించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కాపాడేందుకు కృతనిశ్చయంతో పనిచే



స్తోందని, తడిసిన ప్రతి గింజను కూడా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా కాంటా పూర్తయిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోందని పేర్కొన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని వివరించారు.

# జొన్నల కొనుగోలును వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జొన్నల కొనుగోళ్లు, రవాణా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అత్యవసర గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. జొన్నల రవాణా, గిడ్డంగుల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా చర్యలు చేపట్టాలని, రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ చిత్రు, మార్క్ఫెడ్ డీఎం మహేష్ కుమార్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తాం



**ఉద్యమ కెరటం, ఎల్లారెడ్డిపేట:** ఎల్లా రెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐకేపీ, ప్యాక్స్ కేంద్రాల్లో నిల్వ ఉన్న తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఐకేపీ, ప్యాక్స్ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన గోదాములకు తరలించేందుకు జిల్లా అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, నారాయణపూర్ సర్పంచ్ దొమ్మటి నర్సయ్య, తిమ్మాపూర్ ఉప సర్పంచ్ జజ్జరి దేవేందర్, ఏఎంసీ డైరెక్టర్లు కృష్ణారెడ్డి, మెండే శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్, అనవేని రవి, బుచగౌడ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు





- చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- మంత్రి గడ్డం వివేకానంద

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి కొనుగోలు కేంద్రాల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మండల తహశీల్దార్ వనజ రెడ్డి తదితర అధికారులతో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోందన్నారు. ఈ ఏడాది ఎకరాకు 28 నుంచి 32 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని తెలిపారు. జూన్ 4వ తేదీ నాటికి 1లక్ష 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతుల అవసరాల దృష్ట్యా పెద్దపల్లిలో రెండు గోదాముల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత ఏర్పడటంతో స్థానికంగా హమాలీలను ఏర్పాటు చేసి ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేశామని చెప్పారు. సింగరేణి సంస్థ సహకారంతో లారీలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని విమర్శించారు. పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 51వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 36వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జైపూర్ మండలంలోని సుముఖ గోదాములో 35వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని, 50 మంది హమాలీలు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 62 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తయిందని, రైతుల ఖాతాల్లో 48 గంటల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు మంత్రి కలెక్టర్తో కలిసి టేకుమట్ల కొనుగోలు కేంద్రం, బాలాజీ గోదాము, షెట్పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందారం వరలక్ష్మి రైస్ మిల్, సుముఖ గోదాములను సందర్శించారు. కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు గరిపెల్లి ప్రభాకర్

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావిస్తూ సేవాభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే నాయకత్వమే దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని బీజేపీ రాష్ట్ర నాయకులు గరిపెల్లి ప్రభాకర్ అన్నారు. గంభీరావుపేట మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఐఆర్, బీఎల్ఏ-2 మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రజల కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సేవ, నమ్మకం, అభివృద్ధి ఇదే బీజేపీ సిద్ధాంతం అని పేర్కొన్నారు. సమావేశం ప్రధాన ఉద్దేశం బూత్ స్థాయి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణలో సమన్వయాన్ని పెంపొందించడం అని తెలిపారు. ప్రతి బూత్లో పార్టీ బలాబలాలను గుర్తించడం, ఓటర్ల జాబితాలోని తప్పులను సరిచేయడం, కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు సోషల్ మీడియా ద్వారా పార్టీ



ప్రచారాన్ని విస్తృతం చేయాలని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త తన బూత్ పరిధిలో కనీసం 20 నుంచి 30 కుటుంబాలను సంప్రదించి పార్టీపై విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. మండల అధ్యక్షుడు కోడె రమేశ్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరం

**ఉద్యమ కెరటం, బోథ్:** శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ తీవ్రంగా ఖండించారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే బీఆర్ఎస్ నేతలు ప్రజలను హింస వైపు ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు అందరికీ ఉన్నప్పటికీ ప్రజా ఆస్తులను ధ్వంసం చేయాలని పిలుపునివ్వడం చట్టవ్యతిరేకమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఉదాహరణ చెబుతూ.. "ఒక ఊరిలో పదవి కోల్పోయిన పెద్దమనిషి యువకులను రెచ్చగొట్టి బడిని, బావిని ధ్వంసం చేయించగా, చివరకు



నష్టపోయింది అమాయక ప్రజలే" అని పేర్కొన్నారు. అదే విధంగా రైలు పట్టాలు కోయండి, సింగరేణి భవన్ను కాల్చేయండి అంటూ బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు కూడా సమాజానికి హానికరమని తెలిపారు. ఇలాంటి ఉద్రిక్తతలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టి సారిస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేలా మాట్లాడే నాయకుల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో హింసను ప్రేరేపించే ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

# సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి





జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో ప్రజల నుంచి స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం లక్షెట్టిపేట మండల తహశీల్దార్ కార్యాలయంలో సాదాబైనామా దరఖాస్తులు, భూభారతి పోర్టల్లో పెండింగ్లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి పోర్టల్ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. భూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించి విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా విచారణ చేసి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం లక్షెట్టిపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును మండల తహశీల్దార్ దిలీప్ కుమార్, మండల వ్యవసాయ అధికారితో కలిసి సందర్శించారు. కొనుగోలు చేసిన వరి ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని, నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే గోదాములకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతికి అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకుముందు మందమర్రి మండలంలోని సప్తగిరి రైస్ మిల్లును సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదాముగా మార్చే అవకాశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బంగారం, వెండి స్థిరం

**హైదరాబాద్:** అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ బంగారం, వెండి ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వాటాల మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతున్నా విలువైన లోహాలకు మాత్రం డిమాండ్ కొనసాగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తాజా వివరాల ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,880గా కొనసాగుతోంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,45,640గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,030గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,45,790గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కిలో వెండి ధర రూ.2,94,900గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,84,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,94,900గా ఉండగా, బెంగళూరులో కిలో వెండి ధర రూ.2,84,900గా నమోదైంది. బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కరెన్సీ మార్పుల ఆధారంగా ఎప్పటికప్పుడు మారే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

## ఉద్యోగులకు భారీ బోనస్




**హైదరాబాద్ :** కృత్రిమ మేధస్సు రంగంలో పెరుగుతున్న అవకాశాల కారణంగా సాంకేతిక రంగ సంస్థలు భారీ లాభాలు నమోదు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ సంస్థ తన సెమీకండక్టర్ విభాగం ద్వారా వచ్చిన లాభాలను ఉద్యోగులతో పంచుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల త్రైమాసిక కాలంలో సంస్థ ఆదాయం భారీగా పెరగడంతో ఉద్యోగులకు భారీ బోనస్‌లు ప్రకటించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం చిప్ విభాగానికి చెందిన ఒక్కో ఉద్యోగికి దాదాపు రూ.3.3 కోట్ల వరకు బోనస్ అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ విభాగానికి అధిక ఆదాయం వచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు సేవలు, సర్వర్లు, సమాచార నిల్వ కేంద్రాలు, అధిక సామర్థ్య జ్ఞాపక చిప్‌లకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. ఈ కారణంగా కంపెనీకి భారీ లాభాలు వచ్చినట్లు సమాచారం. అలాగే లాభాల్లో వాటా కోరుతూ ఉద్యోగులు కూడా తమ డిమాండ్లు వినిపించినట్లు తెలుస్తోంది. దీంతో సంస్థ యాజమాన్యం ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు 78 వేల మంది ఉద్యోగులకు సంస్థ లాభాల్లో శాతం మేర బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అదనంగా ఇప్పటికే అమల్లో ఉన్న ప్రోత్సాహక పథకాలను కూడా కొనసాగించనున్నట్లు సమాచారం. అయితే ఇతర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు తక్కువ స్థాయిలో బోనస్ లభించే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## వాట్సప్‌లో కొత్త సేవ?




**హైదరాబాద్ :** ప్రముఖ సందేశాల వేదిక వాట్సప్ వినియోగదారులకు కొత్త సేవ అందుబాటులోకి వచ్చిందనే వార్తలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. వినియోగదారులకు అదనపు సౌకర్యాలు అందించేందుకు చందా ఆధారిత సేవను ప్రవేశపెట్టినట్లు సమాచారం. ఈ కొత్త విధానం ద్వారా పలు ప్రత్యేక సదుపాయాలు పొందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. చందా తీసుకున్న వినియోగదారులకు అనేక అదనపు ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని సమాచారం. యాప్ రూపాన్ని మార్చుకునేందుకు పలు ఆకర్షణీయ ఎంపికలు, ప్రత్యేక గుర్తులు, సందేశాలకు వ్యక్తిగత శబ్దాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండనున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రతి చాట్‌కు ప్రత్యేక ధ్వనులను ఎంపిక చేసుకోవడం, కృత్రిమ మేధస్సు ఆధారిత గుర్తులు, ప్రత్యేక చాట్ జాబితా వంటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉండే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సేవను ఉపయోగించుకోవాలనుకునే వారు స్వచ్ఛందంగా మాత్రమే చందా తీసుకోవచ్చని చెబుతున్నారు. సాధారణ వినియోగదారులపై దీని ప్రభావం ఉండదని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉచిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంటున్నారు. అయితే ఇలాంటి కొత్త సేవలకు సంబంధించిన అధికారిక వివరాలను వినియోగదారులు సంస్థ ప్రకటించిన సమాచారంతో నిర్ధారించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎయిరిండియా సర్వీసుల కోత




**హైదరాబాద్:** జులై, ఆగస్టు నెలల్లో ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించాలనుకునే ప్రయాణికులకు కొన్ని మార్గాల్లో ఎంపికలు తగ్గే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో మార్పులు చేసిన సంస్థ, ఇప్పుడు దేశీయ విమానాల సంఖ్యను కూడా తగ్గించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విమాన ఇంధన ధరల ప్రభావం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమానయాన వర్గాలు చెబుతున్నాయి. జులై, ఆగస్టు నెలల్లో దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఏ మార్గాన్ని పూర్తిగా రద్దు చేయకుండా కేవలం విమానాల రాకపోకల సంఖ్యను మాత్రమే తగ్గించాలని సంస్థ భావిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల కొన్ని మార్గాల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉండే విమానాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ఈ మార్పులు పూర్తిగా తాత్కాలికమని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత పాత షెడ్యూల్ ప్రకారం సేవలను మళ్లీ ప్రారంభిస్తామని పేర్కొన్నట్లు సమాచారం. అలాగే షెడ్యూల్ మార్పుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు కూడా అందించనున్నట్లు సంస్థ తెలిపింది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ విమానాల్లో సీట్లు కేటాయించడం, అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీలను మార్చుకునే అవకాశం ఇవ్వడం లేదా పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించే సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించింది. రాబోయే రెండు నెలల్లో ప్రయాణించేవారు ముందుగానే తమ విమాన షెడ్యూల్ వివరాలను పరిశీలించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# బైజూస్ వ్యవస్థాపకుడికి షాక్



**హైదరాబాద్ :** ఒకప్పుడు దేశంలో అత్యంత వేగంగా ఎదిగిన విద్యా సాంకేతిక సంస్థగా గుర్తింపు పొందిన బైజూస్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు కోట్లాది విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యను అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆకర్షించిన ఈ సంస్థ ఇప్పుడు వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. కంపెనీ అత్యున్నత స్థాయిలో ఉన్న సమయంలో దాని విలువ భారీ స్థాయికి చేరుకుంది. వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ కూడా దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తాజా సమాచారం ప్రకారం సింగపూర్ న్యాయస్థానం ఆస్తులకు సంబంధించిన కోర్టు ఆదేశాలను పాటించలేదనే కారణంతో బైజూ రవీంద్రన్‌కు కోర్టు ధిక్కరణ కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు సమాచారం. విద్యా రంగంలో వేగంగా ఎదిగిన ఈ సంస్థ తరువాత పలు కంపెనీల కొనుగోళ్లు, విస్తరణ ప్రణాళికలు చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా విస్తరణ కోసం భారీ మొత్తంలో రుణాలు కూడా తీసుకుంది. అయితే కాలక్రమంలో ఆర్థిక నిర్వహణ, పారదర్శకత, రుణాల చెల్లింపులపై ప్రశ్నలు తలెత్తడంతో పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. అమెరికా, సింగపూర్ వంటి దేశాల్లో పలు న్యాయపరమైన వివాదాలు కొనసాగుతున్నాయి. భారీ రుణాలు, పెరిగిన నష్టాలు, ఆలస్యమైన ఆర్థిక నివేదికలు సంస్థను మరింత ఒత్తిడిలోకి నెట్టినట్లు తెలుస్తోంది.

ఒకప్పుడు వేగవంతమైన ఎదుగుదలకు ప్రతీకగా నిలిచిన ఈ సంస్థ ప్రస్తుతం న్యాయ, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ చర్చనీయాంశంగా మారింది.

# ఆదాయం పెరిగినా.. ఆందోళనలో ఖజానా



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఖజానాకు వస్తున్న ఆదాయంలో వృద్ధి నమోదైనప్పటికీ, పెరుగుతున్న ఖర్చులతో పోలిస్తే రాబడి ఆశించిన స్థాయిలో పెరగడం లేదని ఆర్థిక శాఖ లెక్కలు సూచిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాంతానికి రాష్ట్రానికి వివిధ మార్గాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ.5,45,085.89 కోట్లుగా నమోదైనట్లు సమాచారం. అయితే బడ్జెట్‌లో ప్రతిపాదించిన అంచనాలు, వాస్తవంగా వచ్చిన ఆదాయం మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తున్నట్లు వెల్లడైంది. అంచనాలకు తగ్గట్టుగా ఆదాయం రాకపోవడంతో రాష్ట్రం అధికంగా అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆదాయంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే ప్రధాన వనరుగా కొనసాగుతోంది. అయితే ఆర్థిక కార్యకలాపాలు మందగించడం వల్ల ఆశించిన స్థాయిలో ఆదాయం పెరగడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నిర్మాణ రంగం, స్థిరాస్తి రంగం బలపడితే రిజిస్ట్రేషన్లు, వస్తు సేవల పన్ను, విక్రయ పన్ను తదితర మార్గాల్లో ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గత కొన్నేళ్లలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగం ద్వారా వచ్చిన ఆదాయంలో తగ్గుదల కనిపించినట్లు ఆర్థిక వివరాలు తెలియజేస్తున్నాయి. అలాగే పన్నుల ఆదాయంలో కూడా అంచనాలకు తగ్గట్టుగా వసూళ్లు జరగలేదని తెలుస్తోంది. పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సహాయ నిధులు కలిపి కూడా రాష్ట్ర ఖజానాకు గణనీయమైన ఆదాయం సమకూరినట్లు సమాచారం. మొత్తంగా పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం, కేంద్ర సహాయ నిధులు కలిపి రాష్ట్రానికి రూ.5,45,085.89 కోట్ల ఆదాయం లభించినట్లు వెల్లడైంది.

అయితే ఆదాయం పెరుగుతున్నప్పటికీ వ్యయాలు కూడా వేగంగా పెరుగుతుండటంతో భవిష్యత్తులో ఆర్థిక నిర్వహణ కీలకంగా మారే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## కొత్త జియో ఓటీటీ పాస్ విడుదల

**హైదరాబాద్ :** తక్కువ ధరలో వినియోగదారులకు మెరుగైన వినోద సేవలను అందించే లక్ష్యంతో జియో కొత్త ఓటీటీ పాస్‌ను విడుదల చేసింది. ఒకే రీఛార్జ్ ద్వారా మొబైల్ కనెక్టివిటీతో పాటు పలు వినోద సేవలను అందించే విధంగా 28 రోజుల కాలపరిమితితో ఈ కొత్త ప్యాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సరికొత్త ప్యాక్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో వినియోగదారులు పొందవచ్చని సమాచారం. అయితే ఈ ప్యాక్‌ను వినియోగించుకోవాలంటే వినియోగదారుల మొబైల్‌లో ఇప్పటికే అమల్లో ఉన్న ప్రాథమిక రీఛార్జ్ ప్యాక్ తప్పనిసరిగా ఉండాలని కంపెనీ తెలిపింది. ఈ కొత్త ప్యాక్ ద్వారా వినియోగదారులకు మొత్తం 15 ప్రీమియం వినోద వేదికల సేవలు లభించనున్నాయి. ఇందులో ప్రముఖ వీడియో వేదికలు, క్రీడా ప్రసారాలు, ప్రత్యేక చిత్రాలు, ధారావాహికలు, అంతర్జాతీయ చిత్రాల సేవలు అందుబాటులో ఉండనున్నట్లు సమాచారం. అలాగే జియో టీవీ ద్వారా వినియోగదారులు 1,000కు పైగా ప్రత్యక్ష ప్రసార టెలివిజన్ ఛానళ్లను వీక్షించే అవకాశం కూడా పొందనున్నారు. వీటిలో 150కు పైగా చెల్లింపు ఆధారిత ఛానళ్లు కూడా అందుబాటులో ఉంటాయని తెలుస్తోంది. తక్కువ ధరలో ఎక్కువ వినోదాన్ని అందించే లక్ష్యంతో ఈ కొత్త ప్యాక్‌ను తీసుకొచ్చినట్లు సమాచారం. దీనిపై వినియోగదారుల్లో ఆసక్తి నెలకొంది.

## క్రెడిట్ కార్డు నగదు జాగ్రత్త

**హైదరాబాద్ :** ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో క్రెడిట్ కార్డుల వినియోగం గణనీయంగా పెరిగింది. అత్యవసర పరిస్థితుల్లో లేదా నగదు కొరత ఏర్పడినప్పుడు చాలా మంది క్రెడిట్ కార్డులను ఏటీఎం కేంద్రాల్లో ఉపయోగించి నగదు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ వల్ల ఎదురయ్యే ఆర్థిక ప్రభావాల గురించి చాలామందికి పూర్తి అవగాహన ఉండదు. సాధారణంగా క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోళ్లు చేసినప్పుడు బ్యాంకులు కొంతకాలం వరకు వడ్డీ లేకుండా చెల్లింపు సౌకర్యాన్ని కల్పిస్తాయి. కానీ అదే కార్డును ఉపయోగించి ఏటీఎం నుంచి నగదు తీసుకున్న వెంటనే ఆ సౌకర్యం నిలిచిపోతుంది. నగదు తీసుకున్న మొదటి రోజు నుంచే వడ్డీ లెక్కింపు ప్రారంభమవుతుంది. అంతేకాకుండా ఈ నగదు ఉపసంహరణలపై బ్యాంకులు సాధారణ రుణాలతో పోలిస్తే అధిక వడ్డీ రేట్లను అమలు చేస్తాయి. కొన్ని సందర్భాల్లో వార్షికంగా అధిక స్థాయిలో వడ్డీ విధించే అవకాశం కూడా ఉంటుంది. దీనితో పాటు నగదు ఉపసంహరణ రుసుము పేరిట అదనపు చార్జీలు కూడా వసూలు చేస్తారు. ప్రతి లావాదేవీపై నిర్దిష్ట రుసుము లేదా ఉపసంహరించిన మొత్తంలో కొంత శాతం వసూలు చేసే అవకాశం ఉంది. అదనంగా ఈ సేవలపై పన్నులు కూడా వర్తిస్తాయి. ఫలితంగా తక్కువ మొత్తం కోసం తీసుకున్న నగదు కూడా తరువాత భారీ ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే అత్యవసర పరిస్థితులు మినహా క్రెడిట్ కార్డు ద్వారా ఏటీఎం కేంద్రాల నుంచి నగదు తీసుకోవడాన్ని వీలైనంత వరకు నివారించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.





# ఆర్సీబీ విజయ రహస్యం చెప్పిన భువీ

**హైదరాబాద్ :** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా జట్టు బౌలింగ్ విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్న భువనేశ్వర్ కుమార్ తన అనుభవాలను పంచుకుంటూ జట్టు విజయ రహస్యాలను వెల్లడించారు. గుజరాత్ జట్టుపై కీలక విజయాన్ని నమోదు చేసిన అనంతరం మాట్లాడుతూ గణాంకాలు జట్టుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అయితే వాటిపైనే పూర్తిగా ఆధారపడబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఆడే ఆటగాళ్లు చేసే ప్రయోగాలను జాగ్రత్తగా పరిశీలిస్తామని, వారి ఆట తీరును విశ్లేషిస్తామని పేర్కొన్నారు. ప్రత్యర్థి బ్యాటర్లు భారీ షాట్లు ఆడకుండా నియంత్రించడం, వారిని వికెట్ల ముందు చిక్కించుకోవడం లేదా నేరుగా వికెట్లు పడగొట్టడంపై ఎక్కువగా దృష్టి పెడతామని చెప్పారు. తనతో పాటు జోష్ హేజిల్‌వుడ్ అనుభవం కూడా జట్టుకు ఉపయోగపడుతోందని వెల్లడించారు. అలాగే సహాయక సిబ్బంది అందిస్తున్న చిన్నచిన్న సూచనలు కూడా జట్టు విజయానికి ఎంతో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. వరుసగా రెండోసారి జట్టు ఫైనల్‌కు చేరుకోవడంలో తెరవెనుక పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సీజన్‌లో భువనేశ్వర్ కుమార్ అద్భుత బౌలింగ్ ప్రదర్శన కనబరుస్తూ కీలక వికెట్లు సాధించారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు చరిత్రలో ఇది ఐదోసారి తుది పోరుకు చేరడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.



## ఆర్సీబీ మరో అరుదైన ఘనత

**అహ్మదాబాద్ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు సరికొత్త అధ్యాయాన్ని రాస్తూ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. గత ఏడాది తొలిసారి టైటిల్‌ను సొంతం చేసుకున్న ఆర్సీబీ, అదే జోరును కొనసాగిస్తూ 2026 సీజన్‌లో కూడా తుది పోరుకు చేరింది. దీంతో వరుసగా రెండు సంవత్సరాలు ఫైనల్‌కు చేరిన అరుదైన జట్ల జాబితాలో చోటు సంపాదించింది. క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఈ భారీ టోర్నీలో ఇప్పటివరకు చాలా తక్కువ జట్లు మాత్రమే వరుసగా రెండు సార్లు ఫైనల్‌కు చేరగలిగాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ తీవ్ర ఒత్తిడిని అధిగమిస్తూ మరోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. దీంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఐపీఎల్ చరిత్రను పరిశీలిస్తే ఈ అరుదైన ఘనతను మొదట చెన్నై జట్టు సాధించింది. ఆ జట్టు మూడు వేర్వేరు సందర్భాల్లో వరుస సీజన్లలో ఫైనల్‌కు చేరి ప్రత్యేక రికార్డు సృష్టించింది. ఆ తర్వాత ముంబై జట్టు, గుజరాత్ జట్టు కూడా వరుసగా రెండు సార్లు తుది పోరులో నిలిచాయి. ఇప్పుడు అదే జాబితాలో బెంగళూరు జట్టు చేరింది. అయితే వరుసగా రెండు సార్లు ఫైనల్‌కు చేరడం ఒక ఘనత అయితే, వరుసగా రెండు టైటిళ్లు గెలవడం మరింత ప్రత్యేకమైన ఘనతగా నిలిచింది. ఇప్పటివరకు ఈ రికార్డును కేవలం చెన్నై, ముంబై జట్లు మాత్రమే సాధించాయి. ఇప్పుడు క్వాలిఫయర్ పోరులో విజయం సాధించి ఫైనల్ చేరిన బెంగళూరు జట్టు కూడా ఆ జాబితాలో చేరుతుందా లేదా అనేది అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది.

# సన్‌రైజర్స్ ఔట్ రాజస్థాన్ ఇన్!

## ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్‌పై 47 పరుగుల తేడాతో విజయం

29 బంతుల్లో 97 పరుగులతో విధ్వంసం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ

చేతులెత్తేసిన సన్ రైజర్స్ బ్యాటర్లు

ఐపీఎల్ క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లిన రాజస్థాన్ రాయల్స్

**చండీగఢ్, మే 27:** పీ సీ ఏ న్యూ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన ఐ పీ ఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఈ నాకౌట్ పోరులో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి 47 పరుగుల తేడాతో ఘన విజయం సొంతం చేసుకుంది.

### రాజస్థాన్ భారీ స్కోరు

టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న సన్ రైజర్స్ కు రాజస్థాన్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే ఎ ా ద ్ ు ్ గ ా చెలరేగిపోయాడు. కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. సెంచరీకి కేవలం 3 పరుగుల దూరంలో అవుటయ్యాడు. ధ్రువ్ జురెల్ 21 బంతుల్లో 50 పరుగులు సాధించి భారీ స్కోరుకు బాటలు వేశాడు. యశస్వి జైస్వాల్ 29 బంతుల్లో 29 పరుగులు చేశాడు. సన్ రైజర్స్ బౌలర్లలో ప్రఫుల్ హింగె 54 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. నితీశ్ కుమార్ రెడ్డి 12 పరుగులిచ్చి 1 వికెట్, శివాంగ్ కుమార్ 19 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు.

### చతికిలబడ్డ సన్ రైజర్స్

244 పరుగుల కఠిన లక్ష్య ఛేదనలో సన్ రైజర్స్ హైదరాబాద్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి 19.2 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌట్ అయింది. నితీశ్ కుమార్ రెడ్డి 20 బంతుల్లో 38 పరుగులు, సలిల్ అరోరా 21 బంతుల్లో 35 పరుగులు, ఇషాన్ కిషన్ 11 బంతుల్లో 33 పరుగులు చేసి కాసేపు ప్రతిఘటించినా జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయారు. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన బంతులకు మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. జోఫ్రా ఆర్చర్ 58 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా 21 పరుగులకు 2 వికెట్లు, సుశాంత్ మిశ్రా 21 పరుగులకు 2 వికెట్లు తీసి సన్ రైజర్స్ పతనాన్ని శాసించారు. ఎలిమినేటర్ మ్యాచ్ కావడంతో పరాజయం పాలైన సన్ రైజర్స్ హైదరాబాద్ టోర్నీ నుంచి శాశ్వతంగా నిష్క్రమించింది. అద్భుత విజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2 కు సగర్వంగా అడుగుపెట్టింది.





# ధోనీపై సీఎస్కే కీలక వ్యాఖ్యలు



**చెన్నై :** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు అనగానే అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. జట్టుతో ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమైనదిగా మారింది. అయితే మోకాలి గాయం కారణంగా ప్రస్తుత సీజన్‌లో ధోనీ ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడకపోవడంతో ఆయన భవిష్యత్తుపై చర్చలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో ధోనీ భవిష్యత్తుపై చెన్నై జట్టు ప్రధాన కార్యనిర్వాహక అధికారి కాశీ విశ్వనాథన్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ధోనీ ఆటగాడిగా కొనసాగాలనుకుంటున్నారా, శిక్షకుడిగా బాధ్యతలు తీసుకుంటారా లేదా మార్గదర్శకుడి పాత్రలో కొనసాగుతారా అనేది పూర్తిగా ఆయన వ్యక్తిగత నిర్ణయమేనని పేర్కొన్నట్లు సమాచారం. జట్టుకు సంబంధించిన కీలక నిర్ణయాల్లో ధోనీ అభిప్రాయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని కూడా వెల్లడించినట్లు తెలుస్తోంది. ధోనీ ఇప్పటివరకు తన విరమణపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి జట్టు నిర్వహణలో లేదా సహాయక సిబ్బందిలో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశాలపై చర్చలు సాగుతున్నాయి. జట్టు శిక్షకుడి బాధ్యతలకు కూడా ధోనీ సరైన వ్యక్తి అవుతారని పలువురు మాజీ ఆటగాళ్లు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.

# పాక్ జట్టులో మరో వివాదం

**లాహోర్ :** పాకిస్థాన్ క్రికెట్ జట్టులో మరోసారి విభేదాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. జట్టు దీర్ఘకాలిక ఫిజియో క్లిఫ్ డీకన్‌ను అకస్మాత్తుగా తొలగించిన నిర్ణయంపై పలువురు సీనియర్ ఆటగాళు, ముఖ్యంగా వేగ బౌలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని వారు బోర్డును కోరుతున్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో జరగనున్న ఒకరోజు అంతర్జాతీయ సిరీస్‌కు ప్రకటించిన సహాయక సిబ్బంది జాబితాలో డీకన్‌కు స్థానం కల్పించలేదు. ఆయన స్థానంలో కొత్త ఫిజియోను నియమించినట్లు సమాచారం. చాలా సంవత్సరాలుగా జట్టుతో కలిసి పనిచేస్తున్న డీకన్‌కు ఆటగాళ్లతో మంచి అనుబంధం ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా బౌలర్ల శారీరక దృఢత్వం, గాయాల నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అయితే జట్టులో తరచూ తలెత్తుతున్న గాయాల సమస్యలపై అసంతృప్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అభిప్రాయంతో ఆటగాళ్లు ఏకీభవించడం లేదని సమాచారం. గాయపడిన ఆటగాళ్ల పునరుద్ధరణ మొత్తం ఫిజియో బాధ్యత కాదని, చిన్న గాయాలను ఆయన సమర్థంగా నిర్వహించేవారని కొందరు ఆటగాళ్లు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్ జట్టుకు చెందిన పలువురు విదేశీ శిక్షకులు, సహాయక సిబ్బంది మధ్యలోనే వైదొలగడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితులు భవిష్యత్తులో అనుభవజ్ఞులైన విదేశీ నిపుణులను ఆకర్షించడంలో ఇబ్బందులు కలిగించే అవకాశముందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉద్యమ కెరటం తెలుగు దినపత్రిక

గురువారం
28 మే 2026





# నమిత వ్యాఖ్యలు వైరల్

తన అందం, అభినయంతో దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి నమిత ప్రస్తుతం సినిమాలకు దూరంగా కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. అయితే గతంలో ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా ప్రముఖ కార్యక్రమంలో పాల్గొన్న అనుభవాలు, సామాజిక మాధ్యమాల్లో ఎదురైన వ్యక్తిగత విమర్శల గురించి ఆమె చెప్పిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ప్రముఖ వినోద కార్యక్రమంలో పాల్గొన్న అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, ఆ కార్యక్రమంలో పాల్గొనే వారికి ప్రధానంగా రెండు మార్గాలు ఉంటాయని ఆమె తెలిపారు. ఒకటి నిజాయితీగా, సహజంగా ఉండటం అని పేర్కొన్నారు. అయితే ఆ మార్గాన్ని ఎంచుకుంటే విమర్శలు, అవమానాలు, వ్యక్తిగత దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. మరోవైపు ప్రేక్షకులు ఏమి చూడాలనుకుంటున్నారో అదే చూపిస్తూ భావోద్వేగాలు లేదా ఇతర అంశాలతో వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేయవచ్చని అన్నారు. కానీ అది కొంతవరకు నటనతో కూడుకున్నదని ఆమె అభిప్రాయపడ్డారు. తన వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ తనకు దగ్గరైన వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటే తాను మౌనంగా ఉండనని స్పష్టం చేశారు. తన కోసం మాత్రమే కాదు, కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం కూడా నిలబడతానని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఎదురైన విమర్శల గురించి మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని వెల్లడించారు. మొదట్లో అలాంటి వ్యాఖ్యలను చూసి మానసికంగా చాలా ఇబ్బంది పడ్డానని చెప్పారు. తన భర్త కూడా వ్యాఖ్యలను నిలిపివేయాలని సూచించారని తెలిపారు. అయితే తరువాత పరిస్థితిని ధైర్యంగా ఎదు-ర్కోవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని భావించానని పేర్కొన్నారు. కొందరికి తన వైపు వివరించే ప్రయత్నం చేశానని, కొందరు అర్థం చేసుకున్నారని, మరికొందరు అర్థం చేసుకోలేదని చెప్పారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో కొందరు చేసే వ్యక్తిగత వ్యాఖ్యలు చాలా బాధాకరంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

# హెబ్బా ఎదురు చూపులు



చిత్ర పరిశ్రమలో ఎంతో మంది కథానాయికలు వస్తుంటారు, వెళ్తుంటారు. కొందరు ఒక్క చిత్రంతోనే ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదిస్తే, మరికొందరు ప్రతిభ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేక వెనుకబడిపోతుంటారు. అలాంటి నటీమణుల్లో హెబ్బా పటేల్ కూడా ఒకరుగా చెప్పవచ్చు. హెబ్బా పటేల్ తెలుగులో తన తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె తక్కువ సమయంలోనే ప్రత్యేక అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు. తరువాత కుమారి 21 ఎఫ్ చిత్రంతో ఒక్కసారిగా భారీ గుర్తింపు దక్కించుకుని యువ ప్రేక్షకుల్లో ప్రత్యేక క్రేజ్ సంపాదించారు. ఆ చిత్రం ఘన విజయం సాధించిన తర్వాత వరుసగా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయారు. మొత్తం పన్నెండు చిత్రాల్లో నటించినా అందులో కొద్ది చిత్రాలే విజయాన్ని అందుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తరువాత అవకాశాలు క్రమంగా తగ్గడంతో ప్రత్యేక గీతాల్లో కూడా కనిపించారు. అయితే వాటి ద్వారా కూడా పెద్దగా గుర్తింపు రాలేదని చెబుతున్నారు. ఇటీవల ఓదెల 2 చిత్రంలో కూడా ఆమె కనిపించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తన కొత్త చిత్రాలు, ఫోటోల ద్వారా అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు. మంచి అవకాశం దొరికితే మరోసారి బలమైన పునరాగమనం చేయాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.

# జపాన్‌లో పెద్ది లేనట్లే!



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. మొదట్లో చిత్రబృందం పెద్ది సినిమాను భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా జపాన్‌లో భారీ విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ సినిమా ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. దీంతో పెద్ది సినిమాను కూడా జపాన్‌లో ఒకేసారి విడుదల చేస్తే మంచి స్పందన వస్తుందని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. జపాన్ అభిమానులు కూడా ఈ వార్తతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొన్ని అనివార్య కారణాల వల్ల జపాన్‌లో పెద్ది సేమ్ డే రిలీజ్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో జూన్ 4న సినిమా అక్కడ విడుదల కాన్లైంది. అలాగే అక్కడ నివసిస్తున్న భారతీయ ప్రేక్షకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు నవోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# చిన్నప్పటి కల నిజమైంది

## కమల్ ఆశీస్సులతో భాగ్యశ్రీ భావోద్వేగం! ■ శివకార్తికేయన్ 'సెయాన'పై పెరుగుతున్న అంచనాలు

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం 'సెయాన'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విశ్వనటుడు కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్ హాసన్‌ను కలిశారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ భావోద్వేగ పోస్ట్ చేశారు. "డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటి నుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు అదే చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన ఆ క్షణాలను మాటల్లో చెప్పలేను. మీరు గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా" అంటూ భాగ్యశ్రీ చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'అమరన్' విజయానంతరం శివకార్తికేయన్ కమల్ హాసన్ నిర్మాణ సంస్థలో చేస్తున్న రెండో చిత్రం ఇదే కావడం విశేషం. దర్శకుడు శివకుమార్ మురుగేశన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదం సమపాళ్లలో ఉంటాయని చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాను అక్టోబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. ప్రస్తుతం కమల్-భాగ్యశ్రీ ఫొటోలు, ఆమె చేసిన పోస్ట్ సినీ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి.





# సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల

ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.

# మహేష్‌తో నయన్ కోరిక

దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న నయనతార తన అందం, అభినయంతో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి భారీ అభిమాన వర్గాన్ని ఏర్పరచుకున్నారు. యువ కథానాయకులతో పాటు సీనియర్ నటులతో కూడా కలిసి నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలోని పలువురు అగ్ర నటులతో నయనతార ఇప్పటికే తెర పంచుకున్నారు. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్ వంటి పలువురు ప్రముఖ నటులతో కలిసి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబుతో మాత్రం ఇప్పటి వరకు ఒక్క సినిమాలో కూడా కలిసి కనిపించలేదు. మహేష్ బాబు, నయనతార కలయికలో చిత్రం రావడానికి గతంలో కొన్ని సందర్భాల్లో చర్చలు జరిగినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఇతర చిత్రాలతో బిజీగా ఉండటం వల్ల కొన్ని అవకాశాలు ముందుకు వెళ్లలేదని సమాచారం. అలాగే నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరో కారణమై ఉండొచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన నయనతార, మహేష్ బాబుతో కలిసి నటించే అవకాశం ఇప్పటి వరకు రాలేదని తెలిపారు. ఒకవేళ అవకాశం వస్తే తప్పకుండా నటిస్తానని ఆమె చెప్పినట్లు సమాచారం. ఈ ఇద్దరి కలయిక ఎప్పుడు తెరపై కనిపిస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**